క్లుప్తంగా

తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం



సమస్యలు తెలుసుకుంటున్న చైర్‌పర్సన్

ధర్మపురి: పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ అన్నారు. పట్టణంలోని 8వ, వార్డులో నెలకొన్న సమస్యలను శనివారం పరిశీలించారు. వార్డులో డ్రెయినేజీ, సీసీరోడ్డు సమస్య ఉందని కాలనీవాసులు చైర్మన్‌కు తెలిపారు. అదేవిధంగా వేసవిలో వార్డులో చివరి వరకు తాగునీరందడం లేదని వాపోయారు. రోడ్డుపై ఉన్న బోరింగ్‌ను పరిశీలించి పక్కన వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేశ్, వైస్‌చైర్మన్ రామన్న, కౌన్సిలర్ ఉమారాణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గంగాధర్, సిబ్బంది తదితరులున్నారు.

కుట్టుమిషన్లు, వస్త్రాలు పంపిణీ



కుట్టుమిషన్లు అందిస్తున్న ట్రస్టు సభ్యులు

కోరుట్లరూరల్: పట్టణంలోని వాసవీక్లబ్ గ్రేటర్ కోరుట్ల, వాసవీ వనితా క్లబ్ కోరుట్ల ఆధ్వర్యంలో కుట్టు మిషన్లు, వస్త్రాలు శనివారం పంపిణీ చేశారు.అల్లాడి ట్రస్ట్ తరఫున అల్లాడి అమృత జ్ఞాపకార్థం కుట్టుమిషన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. అల్లాడి ప్రవీణ్, రేగొండ శిరీష్, మహేశ్, నేతి శ్రీకాంత్, రాంమోహన్, మనోజ్, ప్రసాద్, పట్టణ వైశ్యసంఘం, వనితా క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీ కమిటీ రద్దుచేసి సీబీఐతో విచారణ చేపట్టాలి



రిలేదీక్షలో పాల్గొన్న బీఎస్పీ నాయకులు

మల్యాల: టీఎస్‌పీఎస్సీ కమిటీని రద్దుచేసి, పేపర్ లీకేజీపై సీబీఐతో విచారణ చేపట్టాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవీందర్ అన్నారు మల్యాల మండలకేంద్రంలో శనివారం టీఎస్‌పీఎస్సీ కమిటీని రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ రిలే దీక్షచేపట్టారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. గ్రూప్ 1, ఇతర పేపర్ల లీకేజీలో వాస్తవాలు వెలికితీసేందుకు ప్రస్తుత కమిటీని రద్దుచేసి, సీబీఐతో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ మండల అధ్యక్షుడు మునుగూరి నివాస్, తాళ్ల తిరుపతి, భూమేశ్, లీలాగౌడ్, షాహీన్, ప్రణయ్, ప్రసాద్, అజయ్, రాజేశ్ పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీపై కక్షపూరిత చర్యలు మానుకోవాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కథలాపూర్: కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీపై కేంద్రప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించడం దారుణమని మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు అన్నారు. శనివారం కథలాపూర్‌లో కాంగ్రెస్ నాయకులతో కలిసి సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దుచేయడం దుర్మార్గమని మండిపడ్డారు. కార్పొరేట్ శక్తులకు ప్రధాని మోదీ కీలుబొమ్మగా మారివారికి దేశ సంపదను దోచిపెడుతున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎండీ. అజీం, తొట్ల అంజయ్య, పులి హరిప్రసాద్, ఎగ్యారపు శ్రీహరి, కూన శ్రీనివాస్, వెలిచాల సత్యనారాయణ, లింగంగౌడ్, శంకర్, మోయిన్ పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ ఉచిత నమోదు

రాయికల్: పట్టణానికి చెందిన వీరబత్తిని భారతి,శంకరయ్య కుమార్తె లక్ష్మీ,మాధురి జ్ఞాపకార్థం పట్టణంలోని పలువార్డుల్లో ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఉచితంగా పేర్లనమోదుచేసే కార్యక్రమం చేపట్టారు. సుమారు 1500 మంది పేర్లను ఆయుష్మాన్ భారత్‌లో నమోదుచేశారు.

వికలాంగులకు బస్‌పాస్ మేళా

కోరుట్లరూరల్: మండలంలోని నాగులపేటలో టీఎస్‌ఆర్‌టీసీ ఆధ్వర్యంలో శనివారం వికలాంగులకు బస్‌పాస్ మేళా నిర్వహించారు. స్థానిక జీపీ కార్యాలయంలో వికలాంగులకు బస్‌పాస్‌లు జారీ చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ కార్గో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, రమేశ్, రాంమోహన్, గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సాగర్, కుంట రవి, తదితరులు పాల్గొన్నారు.

సండే స్పెషల్

కోరుట్లటౌన్: ప్రభుత్వ పాఠశాలలో తెలుగు పండితుడిగా వృత్తి ధర్మం నిర్వహిస్తూ, ప్రవృత్తిగా తెలుగు సాహితీ రంగంలో ఎనలేని సేవలతో నేరెళ్ల రామకృష్ణశాస్త్రీ గుర్తింపు సాధించారు. కోరుట్ల పట్టణంలోని ఆదర్శనగర్‌లో స్థిరపడిన నేరెళ్ల రామకృష్ణశాస్త్రీ తన పాండిత్యంతో తీరిక వేళల్లో ఆలయాల్లో పౌరోహిత్యం చేస్తున్నారు. తెలుగు భాషా పండితులుగా ఉత్తమ బోధనకు జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అప్పటి కలెక్టర్ జి.రవి చేతులమీదుగా అందుకున్నారు.





తెలుగు సాహిత్య సేవలో

అహంబ్రహ్మ నాటక ప్రదర్శనలో రామకృష్ణశాస్త్రి

‘నేరెళ్ల’

- అందరికీ ఆదర్శం రామకృష్ణశాస్త్రీ
- బోధనలో ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత
- హరికథా గాయకుడు, పద్యకవిగా రాణింపు
- నాటకరంగంలో నారదపాత్రలో గుర్తింపు
- దేవాలయాల్లో పౌరోహిత్యం సేవలు

కుటుంబం-బాల్యం - విద్యాభ్యాసం...

- తల్లిదండ్రులు శ్రీరంగాచార్యులు, హరిప్రేమ గొప్ప విద్వాంసులు. ఉపాధ్యాయులు, కవి, పౌరాణికులు, రంగస్థల నటుడిగా శ్రీరంగాచార్యులు, తల్లి హరిప్రేమ కర్ణాటక సంగీత విద్వాంసురాలిగా పేరు ప్రఖ్యాతులు గడించారు. తల్లిదండ్రుల నేపథ్యంతో నేరెళ్ల రామకృష్ణశాస్త్రీ బాల్యంలోనే వేదికలపై పాటలు పద్యాలు పాడడం, పౌరాణిక నాటకాల్లో చిన్నచిన్న పాత్రలతో ఆకట్టుకున్నారు. నారదపాత్ర రామకృష్ణశాస్త్రీకి మంచి గుర్తింపు తెచ్చింది. గురువులు నరసింహాచార్యుల మార్గదర్శనంలో తెలుగు సాహిత్యంపై అధ్యయనం చేశారు. డిగ్రీస్థాయిలో మేనమామ డి.మురళీ మోహనాచార్యుల ఆశ్రయంలో కవిత్వసాధన, నటన, హరికథా గానం నేర్చుకున్నారు. అనంతరం ఎం.ఏ. తెలుగు పూర్తిచేశారు. తెలుగు పండిత్‌గా శిక్షణ పూర్తిచేసి, ప్రభుత్వ ఉద్యోగం సాధించారు. కరుణశ్రీని వివాహం చేసుకున్నారు. మామ రఘురామచార్యుల వద్ద పౌరోహిత్యం, తమిళ వేదపఠనం, పురాణ ప్రవచనం అభ్యసించారు. ప్రస్తుతం మేడిపల్లి మండలం దమ్మన్నపేటలో జెడ్పీ పాఠశాలలో తెలుగు భాషా పండితుడిగా పనిచేస్తున్నారు.

సాహితీ రంగంలో..

- డాక్టర్ అందె వెంకట్రాజం ప్రోత్సాహంతో కవిగా, అవధానంలో ఆశీస్సులు పొందారు. ఈక్రమంలో తీగుళ్ల శ్రీహరి శర్మ అవధానంలో, తిరుపతిలో మేడసాని మోహన్ అష్టోత్తర సహస్రావధానంలో భాగస్వాములైన నేరేళ్ల రామకృష్ణశాస్త్రీని జీవీ. సుబ్రహ్మణ్యం అభినందనలు పొందారు. 1996లో జాతీయ యువజనోత్సవాల సందర్భంగా డి.వి. మురళీ మోహనచార్యుల దర్శకత్వంలో హిందీనాటకలో నారదపాత్ర వేసి, అందిరి మెప్పు పొందారు. పద్యకవిగా అన్ని వృత్తములలో పద్య రచనలు చేసి గుర్తింపు సాధించారు. రఘురామచార్యుల వద్ద పౌరోహిత్యం, తమిళ వేద పఠనం, పురాణ ప్రవచనం నేర్చుకొని, జగిత్యాల జిల్లాలో అనేక కార్యక్రమాలు నిర్వహించారు. స్వతంత్ర వజ్రోత్సవాల కవి సమ్మేళనంతోపాటు చాలా వేదికలపై తన



రామకృష్ణశాస్త్రీని సన్మానిస్తున్న కలెక్టర్ రవి (ఫైల్)

కవితా గానంతో ఆకట్టుకున్న నేరెళ్ల రామకృష్ణశాస్త్రీ అనేక ప్రశంసాపత్రాలు, అవార్డులు, సన్మానాలు అందుకున్నారు. పాఠశాలలో చక్కగా బోధనచేస్తూ, విద్యార్థుల్లో సాంస్కృతిక, సామాజిక స్పృహను పెంచేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టారు. ఈక్రమంలో నేరెళ్ల రామకృష్ణ శాస్త్రీ సేవలకు ప్రభుత్వం జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో సత్కరించింది.

తెలుగు సాహితీ సేవకు కృషి



నా తల్లిదండ్రులు నాకు నేర్పిన విద్య నాకు ఎంతగానో తోడ్పడింది. కళలు, కవిత్వాలు రాయడం ఎంతో ఆనందంగా ఉంటుంది. తెలుగు సాహితీ సేవకు కృషిచేస్తున్నాను. పాఠశాలలో విద్యార్థులను అద్భుతంగా తీర్చిదిద్దుతాను. సామాజిక సేవలో భాగస్వామ్యం అవుతాను. కవులు, కళాకారులకు ప్రోత్సాహం అందిస్తాను.

– నేరెళ్ల రామకృష్ణ శాస్త్రీ, తెలుగు భాషాపండితుడు, కోరుట్ల

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

- ‘పోషణ పక్వాడ అభియాన్’ ను సద్వినియోగం చేసుకోవాలి
- సిరిధాన్యాలతో ఆరోగ్యం
- ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శంకరమ్మ, భారతి, మమత, నర్సింగరాణి, పద్మావతి



బతికపల్లిలో అవగాహన కల్పిస్తున్న సీడీపీవో



గుండంపల్లిలో పోషణ పక్వాడపై అవగాహన

పెగడపల్లి/కథలాపూర్/మల్లాపూర్/గొల్లపల్లి/రాయికల్: జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాల్లో శనివారం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. పెగడపల్లి మండలంలోని బతికపల్లిలో, కథలాపూర్ మండలంలోని దుంపేటలో, మల్లాపూర్ మండలంలోని పాతదాంరాజుపల్లి,గుండంపల్లి గ్రామాల్లో పోషకాహారంపై గర్భిణులు, బాలింతలు, తల్లులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిరుధాన్యాల ప్రాముఖ్యత, రక్తహీనత, న్యూట్రీగార్డెన్, పర్సనల్ హైజిన్, పౌష్టికాహారం, గ్రూప్ మానిటరింగ్, యోగ, ప్రత్యేక్ష వంటల ప్రదర్శనపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడతాయని మల్యాల సీడీపీవో నర్సింగరాణి, మల్లాపూర్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శంకరమ్మ, భారతి, గొల్లపల్లి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత, వైస్‌ఎంపీపీ ఆవుల సత్యం అన్నారు. కథలాపూర్‌అంగన్‌వాడీకేంద్రంలో, రాయికల్ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో వెల్ బేబీషో కార్యక్రమం నిర్వహించి ఆరోగ్యవంతమైన పిల్లల తల్లులకు బహుమతులు అందించారు.

8న చలో ‘సుద్దాల’కు తరలిరండి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నాయకులు

కథలాపూర్: ఈనెల 8న వేములవాడ నియోజకవర్గంలోని కోనరావుపేట మండలం సుద్దాలలో బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ విగ్రహావిష్కరణ చేస్తున్నట్లు అభిమానులు తరలిరావాలని బీఎస్పీ నాయకులు కోరారు. శనివారం కథలాపూర్ మండలం దుంపేట, గంభీర్‌పూర్, తాండ్ర్యాల, అంబారిపేట గ్రామాల్లోవాల్‌పోస్టర్ ఆవిష్కరించారు.ప్రతీగ్రామం నుంచి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నాయకులు సుద్దాలలో నిర్వహించే కార్యక్రమానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఎస్పీ మండలాధ్యక్షుడు తెడ్డు శేఖర్, నాయకులు బాలె నీలకంఠం, పాలెపు సంజీవ్, వెంకటేశ్, వర్ధన్, గంగాధర్, రమేశ్, గంగారాం, హరీశ్ పాల్గొన్నారు.

కరాటేలో బ్లాక్‌బెల్ట్ సాధించిన విద్యార్థులు



బ్లాక్‌బెల్ట్, ప్రశంసా పత్రం అందిస్తున్న ఇన్‌స్ట్రక్టర్

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రానికి చెందిన కరాటే విద్యార్థులు శుక్రవారం హైదరాబాద్‌లో జపాన్ కరాటే అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన శిక్షకులు రాపోలు సుదర్శన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటేపోటీల్లో బ్లాక్‌బెల్ట్‌లు, ప్రశంసాపత్రాలు సాధించినట్లు కరాటే జగిత్యాల్ జిల్లా ప్రధాన శిక్షకులు ప్రవీణ్‌కుమార్ శనివారం తెలిపారు. బ్లాక్‌బెల్ట్ పరీక్షలో మహిళల విభాగంలో బి.విశాల ఉత్తీర్ణత సాధించింది. బ్రౌన్‌బెల్ట్ పరీక్షలో బాలుర విభాగంలో కె. హర్షవర్ధన్, కె.హేమంత్ ఉత్తీర్ణత సాధించగా వీరికి ప్రశంసాపత్రాలు, బెల్ట్‌లు రాష్ట్ర ప్రధాన శిక్షకులు రాపోలు సుదర్శన్ అందించారు. కార్యక్రమంలో కరాటే శిక్షకు లు పవన్‌కళ్యాణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్

రాయికల్: పట్టణంలోని బస్టాండ్ ప్రాంతంలో మా కామాఖ్య ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా ప్రజల దాహార్తి తీర్చేందుకు ప్రయాణికుల సౌకర్యార్థం ఉచిత చలివేంద్రాన్ని ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ గండ్ర రమాదేవి, కౌన్సిలర్ శ్రీధర్‌రెడ్డి, నాయకులు బూర్గుల రాజేందర్‌స్వామి, రాంమూర్తి, ఆస్పత్రి మేనేజ్మెంట్ సభ్యులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మల్యాల: మండలకేంద్రంలో 11కేవీ ఫీడర్ మరమ్మతులు చేపడుతుండడంతో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మండలకేంద్రంతో పాటు గుడిపేట గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ కొమ్ము కమలేశ్వర్ తెలిపారు. సహకరించాలని కోరారు.

నేటి నుంచి అంబేడ్కర్ ఓపెన్ డిగ్రీ తరగతులు

మెట్‌పల్లి: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం నుంచి అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీ తరగతులు ప్రారంభిస్తున్నట్లు అభ్యాసకుల సహాయ కేంద్రం సమన్వయకర్త చంద్రశేఖర్, అకాడమిక్ కో ఆర్డినేటర్ దశరథం తెలిపారు. 2,4,6 సెమిస్టర్లకు సంబంధించి తరగతులు నిర్వహిస్తామని, విద్యార్థులు తప్పనిసరిగా హాజరకావాలని కోరారు.

రెడ్డిసంఘం అధ్యక్షుడిగా రాజిరెడ్డి

పెగడపల్లి: మండలంలోని నందగిరి గ్రామం రెడ్డి సంఘం అధ్యక్షుడిగా నరెడ్డి (బొంబాయి) రాజిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం ఎన్నికలు శనివారం సంఘం భవనంలో జరిగాయి. ప్రధానకార్యదర్శిగా వాడె సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడిగా గోపు రాజిరెడ్డి, డైరెక్టర్లుగా సంకిటి లక్ష్మారెడ్డి, గోపు నర్సింహరెడ్డి, ఐరెడ్డి మల్లారెడ్డి, పటేలు రవీందర్ రెడ్డి, కాటం అరుణ్‌రెడ్డి ఎన్నికయ్యారు.

వందశాతం పన్నులు వసూలు

బుగ్గారం: మండలంలోని అన్ని గ్రామాల్లో వందశాతం పన్ను వసూలు చేసినట్లు ఎంపీవో అఫ్జల్‌మియా తెలిపారు. మండలంలోని మొత్తం 11 గ్రామాల్లో పన్నులు, పన్నేతర వసూళ్ల లక్ష్యం రూ.5.64 లక్షలు కాగా స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారంతో వందశాతం పన్ను వసూలుచేసినట్లు ఎంపీవో తెలిపారు. జిల్లాలో బుగ్గారం మండలానికి ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి గ్రామాల అభివృద్ధికి కృషిచేస్తున్నారన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

సారంగాపూర్: మండలకేంద్రానికి చెందిన గుర్రపు పోచయ్య (48) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఎస్సై మనోహర్‌రావు కథనం ప్రకారం.. పోచయ్య డ్రైవర్‌గా వెళ్తూ.. వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. ఆరునెలల క్రితం రోడ్డుప్రమాదంలో పోచయ్య తీవ్రంగా గాయపడి చికిత్సపొంది కోలుకున్నాడు. అప్పటి నుంచి అనారోగ్య సమస్యలు తలెత్తడంతో మనస్తాపం చెంది శుక్రవారం ఇంటినుంచి బయటకు వెళ్లాడు. గ్రామశివారుల్లోని అటవీప్రాంతంలో ఉరేసుకుని మృతి చెందినట్లు అటువైపు వెళ్లిన రైతులు గుర్తించడంతో పోలీసులకు సమచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి భార్య లలిత ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె, తల్లి ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సమావేశం

పెగడపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీవో మహేందర్ శనివారం పంచాయ తీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. శానిటేషన్ నిర్వహణ, పచ్చదనం పరిశుభ్రత, ఇంటిపన్ను వసూలు తదితర అంశాలపై గ్రామాల వారీగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పల్లెప్రగతిలో చేపట్టిన అభివృద్ధి పనులు పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. వందశాతం ఇంటిపన్ను వసూలు చేయాలని, చేయని వారు త్వరగా పూర్తిచేసుకోవాలన్నారు. వేసవినేపథ్యంలో మంచి నీటిపథకాలు, పైపులైన్ మరమ్మతులు చేసి గ్రామాల్లో అన్ని వార్డులకు నీరందించాలన్నారు. మంచి నీటి కొరత లేకుండా చూడాలని, ఇందుకు గానూ ఇప్పటినుంచే ప్రత్యామ్యాయ ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు వననర్సరీల్లో పెంచుతున్న మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. నూతన ఇంటి నిర్మాణాలకు తప్పనసరి అనుమతి ఉండాలని అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే వాటిని గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏమైనా ఇబ్బందులు తలెత్తితే తమ దృష్టికి తేవాలన్నారు.

ఇంటింటికీ విద్యుత్ సిబ్బంది



మాట్లాడుతున్న ఎస్ఈ సత్యనారాయణ

మల్యాల: విద్యుత్ సిబ్బంది ఇంటింటికీ తిరిగి సమస్యలు వెంటనే పరిష్కరిస్తున్నారని ఎస్ఈ సత్యనారాయణ అన్నారు. శనివారం మల్యాల ఏఈ కొమ్ము కమలేశ్వర్ దత్తత గ్రామాలైన ముత్యంపేట, తక్కళ్లపల్లి గ్రామాల్లో విద్యుత్‌శాఖ అధికారులు ప్రమాదకరంగా ఉన్న విద్యుత్‌స్తంభాలను తొలగించారు. మీటర్లకు సీల్‌వేశారు. జిల్లా ఎస్ఈ సత్యనారాయణ రెండుగ్రామాల్లో పర్యటించి, పనులు పరిశీలించారు ఒకవైపు వంగిన స్తంభాలు, లూజ్‌వైర్లు సరిచేయడం చెట్లకొమ్మలు తొలగించడం వంటి పనులు చేపడుతున్నామని ఎస్ఈ తెలిపారు. కార్యక్రమంలో మల్యాల ఏడీఈ బాలలింగం ఏఈ కమలేశ్వర్, సర్పంచులు బద్దం తిరుపతిరెడ్డి, గొడుగు కుమారస్వామి, అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలకు సెఫ్టీలాకర్ బహూకరణ



హైస్కూల్‌కు సేఫ్టీ లాకర్ అందించిన విద్యార్థులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండ జెడ్పీపాఠశాలలో పదోతరగతి విద్యార్థులు తమ జ్ఞాపకార్థం సుమారు రూ.10వేలు విలువైన సేఫ్టీలాకర్‌ను హెచ్‌ఎం గడ్డం శ్రీనివాస్‌రెడ్డికి శనివారం అందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం విద్యార్థులను అభినందించారు. అనంతరం పూర్వవిద్యార్థి జోగ ధనుంజయ్ విద్యార్థులకు పరీక్షప్యాడ్లు, పెన్నులు సర్పంచ్ దొంతుల శ్యామల, ఎంపీటీసీ పొనకంటి వెంకటి చేతులమీదుగా అందించారు. కార్యక్రమంలో ఉపసర్పంచు లక్ష్మణ్, విద్యాకమిటీచైర్మన్ గంగాధర్, ఉపాధ్యాయులు రాజేందర్, మురళీ, పీడీ కృష్ణప్రసాద్, ఇమ్మానూయేల్, ఇబ్రహీం, లక్ష్మీ, భాగ్యలక్ష్మీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ టాపర్‌కు సన్మానం



శరణ్యను సన్మానిస్తున్న మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటకు చెందిన ముత్యాల శరణ్య విద్యార్థిని వ్యాసరచన పోటీల్లో డివిజనల్‌స్థాయిలో టాపర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి శనివారం సన్మానించారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థి డివిజనల్ స్థాయిలో ప్రతిభ చాటడం గొప్పవిషయమన్నారు. ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహిస్తామని, చదువులో మరింత రాణించా లని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొండ అంజనేయులు, రైతుబంధు సమితి అధ్యక్షుడు బద్దం మహేందర్‌రెడ్డి, గడ్డం శేఖర్‌రెడ్డి, పూంద్ర జనార్దన్, ముస్కు శ్రీనివాస్, చిట్టి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోనేటి బావిని పునరుద్ధరిస్తాం



డ్రాయింగ్ పరిశీలిస్తున్న డాక్టర్ సంజయ్

కోరుట్లరూరల్: పురాతన కట్టడాల పరిరక్షణకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని బీఆర్‌ఎస్ రాష్ట్రనాయకుడు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. ఈమేరకు పట్టణంలోని గడిబురుజుల వద్ద గల అతి పురాతన కోనేటి బావిని ఆర్కియాలజీ అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంజయ్ మాట్లాడుతూ హైదరాబాద్‌లోని బన్సీలాల్ పేట్ మెట్లబావి తరహాలో కోరుట్ల కోనేటి బావిని పునరుద్దరిస్తామని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎండీ.అయాజ్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

అడవిపందుల దాడిలో వరిపంట ధ్వంసం



సారంగాపూర్: మండలంలోని బట్టపల్లి గ్రామ రైతు గాజుల శ్రీనివాస్‌కు చెందిన ఎకరం వరిపంటపై అడవి పందులు దాడిచేసి భారీ నష్టంకలిగించాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారే సరికి అటవీప్రాంతం నుంచి వచ్చిన పందుల గుంపు వరిపంటపై దాడిచేయడంతో గొలుసుదశలో ఉన్న పొలం పూర్తిగా పాడైంది. దాదాపు రూ.50వేలు పంట నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. అటవీశాఖ, రెవెన్యూ శాఖ అధికారులు పంట నష్టంపై సర్వేచేసి ప్రభుత్వం ద్వారా ఆదుకోవాలని రైతు వేడుకుంటున్నాడు.

జర్నలిస్టు కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

ధర్మపురి/వెల్గటూర్: మృతిచెందిన జర్నలిస్టు కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) జాతీయ కౌన్సిల్ సభ్యులు జె.సురేందర్‌కుమార్, వెల్గటూర్ ప్రెస్‌క్లబ్ మండల అధ్యక్షుడు నక్క లక్ష్మణ్‌యాదవ్, ప్రధానకార్యదర్శి నాగుల రమేశ్ ప్రభుత్వాన్ని కోరారు. విరాళాల సేకరణలో భాగంగా ధర్మపురి పట్టణంలో శనివారం ధర్మపురిప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో, వెల్గటూరు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో విరాళాలు సేకరించా రు. ముందుగా లక్ష్మీనృసింహస్వామి ఆలయం నుంచి నందీకూడలి వరకు విరాళాలు సేకరించారు. వెల్గటూర్ మండలకేంద్రంలో భిక్షాటన చేసి, ప్రభుత్వంపై నిరసన తెలియజేశారు. 14 నెలలుగా ప్రెస్‌క్లబ్ అకాడమీ నుంచి మృతుల కుటుంబాలకు ఎలాంటి ఆర్థికసాయం అందడం లేదని ప్రెస్ అకాడమీకి దర ఖాస్తులు అందించినప్పటికీ స్పందించడం లేదన్నా రు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మధు మహాదేవ్, బొడ్డు కిషన్, సీనియర్ జ ర్నలిస్టులు రామకిష్టయ్య, మురళి, స్తంభంకాడి అశో క్, వడ్లూరి రవీందర్, కళ్యాడపు శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు కర్నె సంతోష్ జర్నలిస్టులు ముత్తినే ని శ్రీనివాస్, చల్ల గంగన్న, రాంబాబు, తిప్పర్తి చంద్రమౌళి, జక్కాపురం లక్ష్మణస్వామి, నారాయణస్వా మి ప్రెస్‌క్లబ్ సభ్యులు వకులాభరణం సత్యం, జూ పాక కిరణ్, గాలిపెల్లి నరేష్, బందెల నరేష్, పాడేటి రవి, కుషనపెల్లి రాజేందర్, కర్నాల నాగరాజు, సింగు శ్రీనివాస్ ఉన్నారు.